# అంతే

బస్సు దిగి రోడ్డు దాటి చెట్టుపక్కనే నిలబడి చేతి గడియారం వంక చూసుకున్నాడు రత్నం. తొమ్మిదీపదయింది. కుడిచేతిలోని ఎయిర్‌బ్యాగును ఎడమచేతిలోకి మార్చుకుంటూ చుట్టూ చూశాడు. పల్లెటూరు గుచ్చుకుంటున్న ఎండలో కదలకుండా నిలబడి ఉంది. బస్సు కదలి వెళ్ళిపోయి దుమ్ము అక్కడే తచ్చాడుతోంది. బస్సు స్టాపుకు షెల్టరు లేదు. ఊరిపేరున్న బోర్డు మీద సినిమా పోస్టరు వేళ్లాడుతోంది. కొద్దిదూరంలో ఉన్న చిన్న కాఫీ హోటలు దగ్గరకు నడిచి లోపలికి వచ్చి కూర్చున్నాడు. చిన్నగా ఊగుతున్న చెక్కబల్లమీదున్న గ్లాసుల మీద ఈగలు ముసిరి ఉన్నాయి. హోటలులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న ఇద్దరుముగ్గురు రత్నాన్ని చూసి మాటలు ఆపి ఈ కొత్తవ్యక్తి ఎవరా అని దృష్టి అతని మీదకు సారించారు. బయటికి పోవటానికి దారిలేక పొగ ఆ చిన్న గదిలోనే తిరుగుతోంది. లావుగా ఉన్న రామయ్య రత్నం దగ్గరకు వచ్చాడు. అతనే ఆ చిన్న హోటలు యజమాని, క్లీనరు, స్వీపరు అన్నీ. అతనికి చొక్కా లేదు. బనియను మాసిపోయి అతని చేతిలోని బల్ల తుడిచే గుడ్డలా ఉంది. ఈగలు ముసిరిన గ్లాసులు తీస్తూ, "ఏం కావాలి?" అడిగాడు.

"తినడానికి ఏమున్నాయి?"

"ఏమీలేవు. ఇడ్లీ, దోసె వేస్తాముకాని అయిపోయాయి. కాఫీ ఉంది, టీ ఉంది."

"ఒక కాఫీ చెప్పండి. వేడిగా ఉందికదూ?"

"వేడి పెట్టిస్తాను, ఏవూరు మీది?"

"గుంటూరు."

"ఎవరింటికి వచ్చారేమిటి?"

"స్కూలుకు."

"మాస్టార్లా?"

తలూపాడు రత్నం.

"బదిలీ అయిన వీరభద్రం గారి స్థానంలో వచ్చారా?"

తనకు ముందున్న సైన్సు మాస్టారు ఎవరో తెలీదు. రత్నం ఏమీ మాట్లాడక

పోయేసరికి అయి ఉంటుంది అనుకున్నాడు రామయ్య. రామయ్య కాఫీ తీసుకురావటానికి వెళ్లగానే సంచి బల్లపక్కన పెట్టి జేబులోంచి రుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. గది వేడిగా ఉంది. మాటలు ఆపేసిన కూర్చున్నవాళ్లు తిరిగి మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. గదిలోని పొగకు తట్టుకోలేక బయటకు వెళ్లి నుంచుంటే బాగుంటుందేమో అనుకున్నాడు రత్నం. బయట ఎండగా ఉంది. రెండు నిమిషాల్లో రామయ్య కాఫీ తెచ్చి రత్నం ముందుంచాడు. గ్లాసు శుభ్రంగా ఉంది. కాఫీ వేడిగా, రుచిగా ఉంది.

కాఫీ తాగటం ముగించి సిగరెట్ వెలిగించాడు రత్నం.

"మీరీపక్కకు లోగడ ఎప్పుడయినా వచ్చారా?" అడిగాడు రామయ్య ఖాళీ గ్లాసు అందుకుంటూ.

"రాలేదు. హెడ్ మాస్టారు గారి ఇల్లెక్కడో చెప్తారా?"

"ఎదురుగా ఉన్న వీధిలోంచి వెళ్తే పసుపు పచ్చ రంగు డాబా కనిపిస్తుంది ఆయనింటికి వెళ్తారా?"

రత్నం తలూపాడు.

"మా అబ్బాయిని మీకూడా పంపిస్తాను. వాడు మీ స్కూలులోనే థర్డ్‌ఫాం చదువుతున్నాడు. రేయ్ చిట్టీ" కేకేశాడు రామయ్య. అప్పటి వరకు తలుపుచాటున ఉన్న చిట్టి బయటకు రాగానే, "మీ కొత్త మాస్టార్రా. సంచి తీసుకొని వెళ్లి హెడ్‌మాస్టారుగారి ఇల్లు చూపించు." అన్నాడు రామయ్య.

చిట్టి సంచి తీసుకోబోతుంటే రత్నం వారించేలోపల చిట్టి సంచి అందుకుని భుజాన తగిలించుకున్నాడు. రత్నం లేచి డబ్బులిచ్చి చిట్టితోపాటు బయటికి వచ్చాడు. బద్ధకంగా పడుకున్న తారు రోడ్డు దాటి వీధిలోకి వచ్చారు.

రత్నానికి అదే మొదటి ఉద్యోగం.

పల్లెటూరి జీవితం కూడా కొత్త. కథల్లో చదవటం, సినిమాల్లో చూడటం, స్నేహితులు చెప్పినప్పుడు వినటం తప్ప అనుభవపూర్వకంగా ఏమీ తెలియదు. గుంటూరులో పుట్టిపెరిగాడు. చదువు అక్కడే సాగింది. బియస్సీ పూర్తి చేసి ఎమ్మెస్సీకి సాగర్ వెళ్లి కెమిస్ట్రీ తీసుకున్న నెలరోజులకు టైఫాయిడ్ వాతపడ్డాడు. చదువుకొనసాగించలేక గుంటూరుకు తిరిగివచ్చాడు. మామూలు మనిషి కావటానికి మరో నెల పట్టింది. ఖాళీగా కూర్చోవటం ఎందుకని అన్‌ట్రెయిన్డ్ టీచర్ పోస్టుకు జిల్లా పరిషత్తుకు అప్లికేషన్ పెట్టిన పదిహేను రోజులకు పోస్టింగ్ ఆర్డర్ వచ్చింది. ఈ కొత్త జీవితం, ఊరు, ఉద్యోగం ఎలా ఉంటాయో? చివరంటా కాలిన సిగరెట్ కిందపడేసి తొక్కాడు. ఆ కొద్దిదూరం నడిచే సరికి చెప్పులమీద ఎర్రమన్ను పేరుకుపోయింది.

చిట్టి హెడ్‌మాస్టారు ఇంటి ముందాగి, "ఇదేనండి" అన్నాడు.

చిట్టి వీధి మెట్లు ఎక్కి తలుపు తట్టబోయే లోపల తలుపు తెరుచుకుంది. బయట స్కూలు ప్యూను, హెడ్ మాస్టారు ఇంట్లో తను ఉతికిన గుడ్డలు దండెంమీద అరవేస్తున్నవాడల్లా ఆగి ఇద్దరి వంకా మార్చి మార్చి చూస్తుంటే "హెడ్‌మాస్టారుగారున్నారా?" అడిగాడు చిట్టి.

"ఉన్నారు."

"ఈయన కొత్త మాస్టారు......" చిట్టి అంటుంటే "ఎవర్రా?" అంటూ ఇంట్లోంచి హెడ్‌మాస్టారు బయటికి వచ్చాడు.

"కొత్త మాస్టారండి."

రత్నం ముందుకు వచ్చి, "నమస్కారమండి. నాపేరు రత్నం" అన్నాడు.

"మీరా..... రండి." ఇంట్లోకి ఆహ్వానించాడు.

చిట్టి చేతిలోని సంచి తీసుకొని ఇంట్లోకి నడుస్తుంటే తనక్కడ ఉండటం అనవసరమని చిట్టి వెనక్కి తిరిగి ఇంటి దారి పట్టాడు. లోపలికి నడిచి నారాయణమూర్తి చూపించిన కుర్చీలో కూర్చున్నాడు రత్నం.

"స్కూలుకు బయల్దేరబోతుంటే మీరొచ్చారు. గుంటూరు నుండి ఇంతదూరం ఈ ఉద్యోగం కొరకు వస్తారని నేననుకోలేదు." అని నవ్వి, "రెండు నిమిషాలు ఆగారంటే గుడ్డలు మార్చుకుని వచ్చేస్తాను." లోపలికి వెళ్లి అయిదు నిమిషాల తరువాత బయటికి వచ్చి, "వెళ్దాంరండి" అన్నాడు. రత్నం లేచి నిలుచున్నాడు. ఇద్దరూ రోడ్డు మీదకు వచ్చి పక్కపక్కన నడవసాగారు. "మునుపు ఎక్కడైనా పనిచేశారా?" అడిగాడు.

"లేదండీ"

"మీరు పెద్ద కష్టపడాల్సిన అవసరం ఉండదనుకుంటాను...పెద్ద క్లాసులకు ప్రిపేరు కావల్సి ఉంటుంది. మీకు పెళ్లి అయ్యిందా?"

"కాలేదు......... ఉండటానికి ఇక్కడ ఇల్లు దొరుకుతుంది కదూ......?"

రత్నం ఎవరో నారాయణమూర్తి ముందుగానే ఊహించాడు. ఇంట్లోకి పిలిచాడు కాని గ్లాసెడు మంచినీళ్లు కాని, కప్పు కాఫీకాని ఇవ్వడానికి అతనికి మనస్కరించలేదు. అందుకే బయటకు త్వరగా తీసుకువచ్చాడు. మీకు......... ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. ఉండటానికి ఊళ్లో ఇల్లు దొరకటం కష్టం. పల్లెలో తప్పకుండా దొరుకుతుంది" అన్నాడు.

"భోజనం పెట్టేవాళ్లు... మెస్‌లాటిది ఏమీలేదా?"

"మునుపు ఉండేవి. ఇప్పుడు లేవు. స్వయం పాకంచేతకాదా?"

తల అడ్డంగా ఆడించాడు రత్నం.

"కష్టమే మరి మీకు" అన్నాడు. 'మీకు' అన్న మాటను వత్తి పలుకుతూ.

స్కూలు భవనం దగ్గరయింది.

"ఈ రోజుకు ఎక్కడయినా భోజనం కుదుర్చుకోండి"

ఆ ఊరుకు కొత్తగా వచ్చిన మాస్టార్లకు రెండు మూడు రోజులపాటు తన ఇంట్లోనే భోజనం పెట్టటం కాని, క్యారియర్‌లో పంపటం కాని నారాయణమూర్తి రివాజుగా చేస్తుంటాడు. అది రత్నం విషయంలో సడలించాడు. అతను తల్చుకుంటే ఏదోవిధంగా సహాయం చేయగలడు. చేయటం ఇష్టంలేదు. స్కూల్లో రత్నానికి అందరితో పరిచయాలయ్యాయి.

ఒంటి గంటయింది. బడి వదిలారు. మాస్టార్లంతా వెళ్లిపోయారు. స్టాఫ్ రూంలో మిగిలిపోయిన రత్నానికి ఏం చేయాలో తోచటంలేదు. ఆకలి వేస్తోంది. లేచి, హోటలు వైపు నడిచి లోపలికి వచ్చి కూర్చోబోతుంటే రామయ్య రత్నంతో ఏదో చెబుదామనుకున్నాడు కాని చెప్పలేక ఆగిపోయాడు. కాఫీ చెప్పి తాగి, సిగరెట్ వెలిగించాక ఖమ్మం వెళ్లటానికి నిర్ణయించుకున్నాడు. అక్కడినుండి ఇరవై నిమిషాల ప్రయాణం. భోజనం చేసి గంటన్నరలో తిరిగి వచ్చేయవచ్చు. లేచి బయటికి వచ్చి, బస్సుకోసం అలా నిల్చున్నాడో లేదో హిందీ మాస్టారు కృష్ణారావు రత్నం దగ్గరకు వచ్చి "నేను మీకోసమే వెతుకుతున్నాను. ఈ పక్కకు వచ్చారని తెలిసి వచ్చాను. రండి. మా ఇంటికి వెళ్లి భోజనం చేద్దాం" అన్నాడు.

రత్నానికి ప్రాణం లేచి వచ్చింది. కృష్ణారావుతోపాటు నడవసాగాడు. "మీకు శ్రమ కలిగిస్తున్నాను" అన్నాడు.

"ఇందులో శ్రమేమీ లేదండీ. ఇంట్లో ఉండేది నేనూ మా అమ్మగారు. మా నాన్న గారు చనిపోయి అయిదేళ్లవుతుంది. మాది గుంటూరు దగ్గర ఊరు. పోయిన సంవత్సరమే ఇక్కడికి వచ్చాము. మీరు వస్తున్నారని చెప్తే మా అమ్మ మీకోసం కూడా భోజనం తయారుచేశారు........" ఇల్లు చేరే వరకు కృష్ణారావు అవి, ఇవి చెప్పుకుంటూ వచ్చి చేరుకోగానే చెంబుతో కాళ్లుచేతులు కడుక్కోటానికి నీళ్లిచ్చి, కడుక్కున్నాక తువ్వాలు అందించి లోపలికి వెళ్లాడు.

లోపలి నుండి కృష్ణారావు తల్లి మాటలు వినిపిస్తున్నాయి. "మనూరి అబ్బాయి అని భోజనానికి తెచ్చావు. బాగుంది. కనీసం ఎవరో, ఏ మతస్థుడో, కులమేదో కనుక్కున్నావా?" అడుగుతోంది.

బయటికి వచ్చిన కృష్ణారావుకు తువ్వాలు అందించి అతను అడగకముందే, "నేను క్రిష్టియన్‌ను" అన్నాడు రత్నం. కృష్ణారావు ఊహించలేదు. స్కూల్లో కూడా మాటవరసకైనా ఎవరు తనతో అనలేదు. పిలిచాక భోజనం పెట్టి పంపించాలో వద్దో అన్న ఆలోచనలో పడ్డాడు. రత్నం చెప్పులు తొడుక్కుని, "వెళ్తాను" అని వీధిలోకి నడుస్తుంటే కృష్ణారావు అతన్ని ఉండమని అనలేదు. తల్లి వప్పుకోదని తెలుసు. నారాయణమూర్తి ఎందుకు తప్పించుకున్నాడో అర్థమయింది. క్రిష్టియన్లకు, మాలలకు, మాదిగలకు పీటవేసి తామెప్పుడు భోజనం పెట్టలేదు. "ఎవరినైనా ఇంటికి కాఫికో, భోజనానికో పిలిచేముందు వాళ్లగురించి తెలుసుకుని చావు......" అంది అతని తల్లి భోజనం వడ్డిస్తూ.

తిరిగి వచ్చి బస్సుకోసం నిలబడిన రత్నానికి ఈ అనుభవం కొత్తగా అనిపించింది. రెండోసారి రామయ్య హోటలుకు కాఫీ తాగడానికి వెళ్లినప్పుడు గాజు గ్లాసుకు బదులు ఇత్తడి గ్లాసు ఎందుకు వచ్చిందో తనకి ఇప్పుడు అర్థమయింది. ఆకలితో ఉండటం వలన ఆ సంగతి పట్టించుకోలేదు. ఇప్పుడా హోటల్‌లోకి వెళ్దామనిపించటంలేదు. అంత ఎండకూడా చల్లగా ఉన్నట్లనిపించసాగింది. దూరంగా ఎండమావుల్ని నెట్టుకుంటూ ఎఱ్రబస్సు రావటం కనిపించేసరికి ప్రాణం లేచి వచ్చింది.

అంతలో స్కూల్ ప్యూన్ దాదాపు పరిగెత్తుకుంటూ తను ఉన్నచోటుకు వస్తోంటే తనకోసమని అనుకోలేదు. దగ్గరగా వచ్చి, "నేను మీకోసమే వచ్చాను. నేను స్కూలు ప్యూనును. గుర్తుపట్టారు కదూ?" అడిగాడు. రత్నం తలూపాడు. "నా పేరు ఏసు. నేను పల్లెలో ఉంటున్నాను. ఈ స్కూలు కట్టిన దగ్గరనుండి ఇక్కడే పనిచేస్తున్నాను. ఇంతవరకు మనవాళ్లు ఎవరూ రాలేదు. మీరే మొదటి వ్యక్తి. నాకెంతో సంతోషంగా ఉంది. మా ఇంటికి వెళ్దాంరండి. మీకోసం భోజనం తయారు చేయించాను. మీరు కాదనకూడదు......" ఏసును రత్నం కాదనలేకపోయాడు. అతని అభిమానానికి ఖమ్మం వెళ్లేప్రయత్నం మానుకుని ఏసు భుజాల మీద చేయివేసి, కూడా నడుస్తోంటే ఎదురైన మనుషులు అదోవిధంగా చూడసాగారు. రత్నం ఎవరో చాలా మందికి తెలిసిపోయింది. రత్నం సిగ్గుపడదల్చుకోలేదు. కృష్ణారావు ఇంటి నుండి వస్తూ ఉద్యోగం వదలి తిరిగి గుంటూరు వెళ్లిపోదామని అనుకున్నవాడు, ఏసును చూసి మనసు మార్చుకున్నాడు. "మనవాళ్లు చాలా మంది ఉన్నారు.అయిదు వరకో, ఏడు వరకో చదివి మానేస్తుంటారు. మీలాంటివాళ్లు కొద్దిగా చేయూతనిస్తే పైకొచ్చే కత్తిలాంటి పిల్లలున్నారు...... నేను చిన్నవాడిని మీరు చదువుకున్నవాళ్లు. అడగకూడదుకాని అడగకుండా ఉండలేకపోతున్నాను........మీరేమీ అనుకోవద్దు. మీరు మాలా, మాదిగా?" అడిగాడు ఏసు.

◆ విశాలాంధ్ర దినపత్రిక, 12 సెప్టెంబరు 1966